నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట హెచ్‌పీఎస్, జనప్రియా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాతాచారికాలనీ, బొంబే అల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా, గురుమూర్తిలేన్, మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, ఆశ్వనీ హెయిర్ ఆయిల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 19, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటి కాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీగా రాఘవేంద్రరావు



అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీగా ఎస్వీ రాఘవేంద్ర రావు బాధ్యతలు స్వీకరించారు. కేవలం నెల రోజుల పాటు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన బాలనాగిరెడ్డిని పేట్ బషీరాబాద్‌కు బదిలీ చేశారు. రామగుండం స్పెషల్ బ్రాంచి ఏసీపీగా పనిచేస్తున్న రాఘవేంద్రరెడ్డిని ఎస్‌ఆర్‌నగర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరి సహకారంతో నేరాలను అదుపు చేయడంతో పాటు శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దాం..

స్కిట్స్‌తో చిన్నారుల సందేశం



సనత్‌నగర్: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం' అనే థీమ్‌తో గత మూడు రోజులుగా వివిధ రూపాల్లో కొనసాగుతున్న చిన్నారుల పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం టీజీపీసీబీ ఆడిటోరియంలో చిన్నారులు పర్యావరణ హిత స్కిట్స్‌తో అదరగొట్టారు. ప్లాస్టిక్ వాడకం గురించి, దాని దుష్ప్రభావాలను వివరించి ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ పరిష్కార మార్గాలను సూచిస్తూ చేసిన స్కిట్స్ ఆలోచన రేకెత్తించాయి. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి ప్రభాకర్, ప్రాజెక్ట్ అధికారికి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పద్మారావునగర్: అసభ్య పదజాలంతో దూషించి తనపై దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐ.చిరంజీవి గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న ఐడీహెచ్ కాలనీలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన తనపై స్థానిక నాయకులు కొందరు తీవ్ర పదజాలంతో దూషించారన్నారు. అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు తాను ఫిర్యాదు చేసినందునే ఈ దాడికి యత్నించారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాజీ ఆర్మీ అధికారికి సైబర్ మోసగాళ్ల టోకరా

బంజారాహిల్స్: విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ ఓ రిటైర్డ్ ఆర్మీ అధికారికి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేసి రూ.44 వేలు కాజేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10సీ లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే గన్‌శ్యాం పాండే (82) అరిటైర్డ్ ఆర్మీ అధికారికి ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉందని చెప్పాడు. అయితే తాను బిల్లు చెల్లించానని, ఎలాంటి బకాయిలు లేవని గన్‌శ్యాం తెలిపాడు. మీరు చెల్లించిన డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదు..ఒకసారి చెక్ చేసుకోండి అంటూ రూ.10 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ పిన్ నెంబర్ నొక్కిన ఆర్మీ అధికారికి మరో నిమిషంలోనే తన ఖాతాలో నుంచి రూ.44 వేలు బదిలీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 'బోర్డు' ఓకే

- 6.62 ఎకరాలు కేటాయిస్తూ తీర్మానం
- రూ.23 కోట్లు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- నూతన బిల్డింగ్ బైలాస్‌లో సవరణలు

కంటోన్మెంట్‌లోనూ 'మార్టిగేజ్'కు ఆమోదం



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో సీఈఓ,ఎమ్మెల్యే

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు బోర్డు ఆమోదం తెలిపింది. నూతన బిల్డింగ్ బైలాస్‌లో సవరణలు... అక్రమ నిర్మాణాల కట్టడికి జీహెచ్‌ఎంసీలో మాదిరిగా మార్టిగేజ్ విధానం అమలుకు రంగం సిద్ధం చేస్తున్న బోర్డు కంటోన్మెంట్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీగణేశ్ పలు సూచనలు చేశారు. రామన్నకుంటను అభివృద్ధి చేయాలని బోర్డు సభ్యురాలు భానుక నర్మద కోరగా ప్రతిపాదనలు పంపాలని కోరింది. వీటితో పాటు మొత్తం 30 అంశాలతో కూడిన అజెండాపై కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ ఎన్వీ నంజుండేశ్వర ఆధ్వర్యంలో జరిగే బోర్డు సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.

చర్చకు వచ్చిన అంశాలివే..

గత నెలలో జరిగిన బోర్డు సమావేశంలో ఆమోదించిన బిల్డింగ్ బైలాస్‌పై ప్రిన్సిపల్ డైరెక్టరేట్ లేవనెత్తడంతో, బోర్డు అధికారులు పలు సవరణలు చేశారు. ముఖ్యంగా ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ), సెట్ బ్యాక్స్, గరిష్ట నిర్మాణ ఎత్తు, జోన్ల విధానాల్లో చేసిన కీలక సవరణలపై బోర్డులో చర్చించి ఆమోదం తెలిపారు. తాజా సవరణలతో కూడిన బిల్డింగ్ బైలాస్‌ను రక్షణ శాఖ ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపనున్నారు.

- మూడో వార్డు పరిధిలోని జీఎల్ఆర్ సర్వే నెంబర్ 661లోని 8.62 ఎకరాల స్థలాన్ని తమకు అప్పగిస్తే, రూ.23 కోట్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రతిపాదించారు. చర్చించిన బోర్డు సంబంధిత స్థలంలో రెండెకరాలు దోబీఘాట్ వినియోగంలో ఉన్నందున, మిగిలిన 6.62 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భవిష్యత్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యతల కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.
- కంటోన్మెంట్ నియోజకవర్గానికి నీటి కొరత తీర్చడానికి గతంకంటే అధికంగా రోజుకు పది లక్షల గ్యాలన్ల నీటి సరఫరా చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అవసరమైతే అదనంగా కూడా నీళ్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.
- ఒకటో వార్డు కంసారి బజార్‌లోని 0.5 ఎకరాల సీ ల్యాండ్‌లో స్కూలు నిర్మించాలని బోర్డు సభ్యురాలు భానుక నర్మద, మల్టీపర్పస్ హాలు నిర్మించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ సూచించారు. అయితే ఈ స్థలంలో స్కూలు తిరిగి స్కూలు నిర్మాణమే చేపట్టేందుకు అనువుగా ఉందని బోర్డు అధికారులు నిర్ణయించారు.
- నూతన బిల్డింగ్ బైలాస్ అమల్లోకి వచ్చాక మాత్రమే మార్టిగేజ్ విధానాన్ని అమలు చేయాలని బోర్డు సభ్యురాలు కోరారు. బిల్డింగ్ బైలాస్ అమల్లోకి రావడానికి ఎంతకాలం పడుతుందో స్పష్టత లేదని, ప్రస్తుతానికి అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలంటే మార్టిగేజ విధానం తప్పదని సీఈఓ మధుకర్ నాయక్ స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్

బన్సీలాల్‌పేట్: పుట్‌పాత్‌లను అక్రమించి....వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తూ ట్రాఫిక్ సమస్యలను సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ అన్నారు. సికింద్రాబాద్ ఆల్ఫాహోటల్ పరిసర ప్రాంతాలు, రైల్వే పార్సిల్ కార్యాలయం, మోండా రోడ్డులో పుట్‌పాత్ అక్రమణలను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ మాట్లాడారు.

- సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా రోడ్లపై ఉన్న ఆటోల అక్రమ పార్కింగ్‌లతో పాటు పుట్‌పాత్ అక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు.
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటున్నారన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు....బయటికి వెళ్లే వారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలియజేశారు.
- నిత్యం తమ సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ప్రయాణీలకులు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు, సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు.

ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజలకు సౌకర్యవంతంగా మేలు చేకూరే విధంగా తాము, తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వాహనచోదకులు, పాదచారులు, చిల్లర, చిన్నపాటి వ్యాపారస్తులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు.

దోమల నివారణకు స్పెషల్‌డ్రైవ్

జోనల్ కమిషనర్ రవి కిరణ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అన్నారు. శుక్రవారం రాత్రి బన్సీలాల్‌పేట్ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి మాసివ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ కోసం మాసివ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జోనల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున యంత్రాల సహాయంతో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జీహెచ్‌ఎంసీ కమీషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జోనల్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు లక్ష్మీపతి, ఫయామ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. స్పెషల్‌డ్రైవ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని డివిజన్‌లోని బీజేఆర్ నగర్, బండ మైసమ్మనగర్, న్యూబోయిగూడ, బోలక్‌పూర్, జయనగర్ కాలనీ, ఐడిహెచ్ కాలనీ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు.



మాసివ్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్ కె. హేమలత

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

రాంగోపాల్‌పేట్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ అన్నారు. శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లోని హిల్‌స్ట్రీట్ పాఠశాల ఆవరణలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారుల పేరు చెప్పి ఖాతాల్లో ఉన్న నగదును తస్కరిస్తున్నారని, అలాగే డిజిటల్ అరెస్టు పేరుతో కూడా చదువుకున్న వాళ్లను కూడా భయపెట్టి మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఫోన్‌లో ఎవరైనా ఏటీఎం పిన్, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు కార్యక్రమంలో ఎస్సైలు వేణుగోపాల్, సుబ్బారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు

- చురుగ్గా నాలాల్లో పూడికతీత పనులు
- డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వరదనీటి నాలాలు, వరదనీటి కాల్వల్లో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వర్షాకాలంలో వరదనీరు నిల్వకుండా పూడికతీత పనులు ప్రతి యేటా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారన్నారు. ఈ సంవత్సరం కూడా బేగంపేట్ సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున పనులు సాగుతున్నాయని తెలియజేశారు. ముఖ్యంగా వరదనీరు నిలిచే ప్రాంతాలను ముందే గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరదనీరు సాఫీగా వెళ్లడానికి వీలుగా వరదనీటి డ్రైన్‌లలో మట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా పలు ఏరియాలను ముందుగా గుర్తించి పనులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ కమిషనర్ వివరించారు. సదరు పనులను కాంట్రాక్టర్లు సక్రమంగా నిర్వహించే విధంగా తమ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. వర్షాలు, ఉదురు గాలులకు రోడ్లు, ఇతరత్రా కాలనీ ప్రాంతాల్లో చెట్లు నేలకూలిన వెంటనే తమ సిబ్బంది అక్కడికి చేరుకొని తొలగిస్తున్నారన్నారు. ఉద్యానవనం విభాగం సిబ్బందికి సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి చేరుకొని రోడ్లపై పడిన చెట్లను హుటాహుటిన తొలగిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని తెలియజేశారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఆయా సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పదోన్నతుల్లో అవకతవకలను సరిచేయడంపై హర్షం

హిమాయత్‌నగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత పదేళ్లలో గిరిజన, దళిత వర్గాలకు సంబంధించిన బోధనేతర సిబ్బంది పదోన్నతుల విషయంలో రివర్షన్‌కు గురై మనోవేదనకు చెందిన గిరిజన, దళిత వర్గాలుగా సంబంధించిన సిబ్బందికి న్యాయం చేకూర్చిన ప్రస్తుత వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య, ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సిహెచ్ విద్యాసాగర్ లకు పీజేటీఏయూ, ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.బాలాజీ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకల కారణంగా ఉన్నత పదవులు పొంది 2, 4 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్న వారికి అన్యాయంగా కింది స్థాయికి మార్చి మనోవేదనకు గురిచేశారని అన్నారు. ఈ తప్పిదాన్ని గుర్తించి నిబంధనలకు అనుగుణంగా సరి చేయడం పట్ల హర్షంవ్యక్తం చేశారు.

ముగ్గురు పిల్లలు సహా తల్లి అదృశ్యం



అదృశ్యమైన తల్లి, ముగ్గురు పిల్లలు

కంటోన్మెంట్: భర్త అక్రమ సంబంధం నేపథ్యంలో మనస్థాపం చెందిన భార్య తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైంది. ఈ ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఓల్డ్ బోయిన్‌పల్లి బృందావన్ కాలనీలో నివాసముండే పి. చెంచయ్య, పి. అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు లక్ష్మీ మానస (20), అమీనా (12), కుమారుడు పి. ధనుష్ ఉన్నారు. చెంచయ్యకు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో నాలుగు నెలలుగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పెద్ద కుమార్తె లక్ష్మీ మానస, బోరబండలో నివసించే తన చిన్నమ్మ లక్ష్మీ ప్రసన్నకు ఫోన్ చేసి, తండ్రి తమను సరిగ్గా చూసుకోవడం లేదని, లాయర్ నెంబర్ కావాలని అడిగింది. మరుసటి రోజు సాయంత్రం 5.30 గంటలకు చెంచయ్య, లక్ష్మీ ప్రసన్నకు ఫోన్ చేసి, అనిత, పిల్లలు మీ ఇంటి వచ్చారా? అంటూ వాకబు చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన లక్ష్మీ ప్రసన్న ఓల్డ్ బోయిన్‌పల్లిలోని సోదరి ఇంటికి వెళ్లి చూడగా, సోదరి, ముగ్గురు పిల్లలు ఇంట్లో లేరని తెలిసింది. తెలిసిన వారిని వాకబు చేసినప్పటికీ వారి ఆచూకీ తెలియకపోవడంతో, లక్ష్మీ ప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తవద్దకు వెళుతున్న అని చెప్పి మహిళ అదృశ్యం



అదృశ్యమైన ఆశాలత

నాందేడ్‌లో నివసించే భర్త వద్దకు వెళ్తున్నానని చెప్పి, ఓ మహిళ అదృశ్యమైంది. బోయిన్‌పల్లి పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఆశాలత అనే మహిళకు కడమ్ దయానంద్ అనే వ్యక్తితో 2009లో వివాహం అయింది. వీరికి సాయి (13), శివ (10) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆశాలత టైలరింగ్ చేసుకుంటూ, తన ఇద్దరు పిల్లలో బోయిన్‌పల్లిలో నివాసముంటోంది. ఆమె భర్త దయానంద్, నాందేడ్‌లో నివసిస్తున్నాడు. తన ఇద్దరు పిల్లలను భర్త ఇంటికి పంపిన ఆశాలత, గత నెల 19న నాందేడ్‌కు బయలు దేరింది. తాను నాందేడ్ చేరుకున్నానని మరుసటి రోజు సోదరుడు శేఖర్‌కు మెసేజ్ పంపింది. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అయితే ఆశాలత తన భర్త వద్దకు చేరుకోలేదని తెలిసి, ఇతరత్రా ప్రాంతాల్లో వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు పాలనలో దళితులకు రక్షణ లేదు



మాట్లాడుతున్న గద్దం అశోక్

ఉస్మానియా యూనివర్సిటీ: తిరుపతిలో ఇంజనీరింగ్ చదివే దళిత విద్యార్థి దాడి చేయడమని అమానుషమని ఓయూ జేఏసీ చైర్మన్ గద్దం అశోక్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విలేకరులతో మాట్లాడారు. కులం పేరుతో దూషించి తీవ్రంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దాడి చేసిన దుండగులపై కేసు నమోదు చేసి చట్ట రీత్యా శిక్షించాలని కోరారు. అధికార పార్టీ చెప్పు చేతల్లో కీలుబొమ్మలుగా మారిన పోలీసులు కేసును నమోదు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.

మళ్లీ ఉగ్రదాడి చేస్తే పాకిస్తాన్ ఉండదు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట: భారత్‌లో మరోసారి పాకిస్తాన్ ఉగ్రదాడులకు పాల్పడితే ప్రపంచ పటంలో లేకుండా చేసే శక్తి భారత సైన్యానికి ఉందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నల్లకుంట నుంచి బర్కత్‌పుర చమాన్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా 'మనం సైతం.. దేశం కోసం.. సైనికులకు వందనం'అనే నినాదంతో ఈ తిరంగా యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బర్కత్‌పుర చమాన్ వద్ద కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆపరేషన సిందూర్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతున్నారని అన్నారు. ఇది పాకిస్తాన్ పాలకులకు, మీడియాకు అనుకూలమైందని పేర్కొన్నారు. ఈ పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

- ఒక్క విమానం కూడా కూలిపోలేదనే విషయం కాంగ్రెస్ నాయకులకు తెలుసన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ ప్రజలు అక్కడి పాలకులు, సైనికులపై తిరుగుబాటు చేస్తున్నారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల విజయం తర్వాత ప్రధాని మోదీ సారథ్యంలో నయా భారత్ నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. పాకిస్తాన్ నేడు చిప్పపట్టుకుని భిక్షం అడుక్కునే స్థితికి దిగజారిందన్నారు.
- భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ ద్వారా 9 ఉగ్రవాదుల స్థావరాలను 23 నిమిషాల్లో ధ్వంసం చేశారని తెలిపారు. ఈ దాడిలో వంద మంది ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు సైనికులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ దయాకర్ తెలిపిన మేరకు.. తుకారాంగేట్‌లోని ఇంద్రలక్ష్మి నగర్ ప్రాంతానికి చెందిన భాను ప్రకాష్(35) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతడు గురువారం రాత్రి తుకారాంగేట్‌లోని వైన్‌షాపుకు వెళ్లాడు. తెల్లవారినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య సరిత అక్కడికి వెళ్లి చూడగా తుకారాంగేట్ సుభాష్ బొమ్మ వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య : కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడంలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లోహియ నగర్‌కు చెందిన యాదగిరి(40) ఆరేళ్ల క్రితం దేవకితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల బాలుడు సంతానం. యాదగిరి ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. అయితే, భార్య భర్తల మధ్య జరిగిన గొడవల కారణంగా ఏడాది క్రితం దేవకి కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన యాదగిరి గురువారం రాత్రి ఇంటో భోజనం చేసి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఉదయం ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమర వీరులకు ఘన నివాళి

సికింద్రాబాద్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని బౌద్ధనగర్ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ పార్శిగుట్ట నుంచి వారాసిగూడ వరకు కొనసాగింది. పార్శిగుట్ట అంబేద్కర్ విగ్రహం వద్ద అమరులైన భారత జవాన్లకు నివాళులు అర్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మోదీ నేతృత్వంలో భారత్ అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నేతి సత్యనారాయణ, రాజు, దత్తు, చైతన్య, సంపత్, శ్యామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో మనమే నంబర్ వన్

చిలకలగూడ: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశరక్షణలో మనమే నంబర్ వన్ స్థానంలో ఉన్నామని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. శుక్రవారం చిలకలగూడ గాంధీ చౌక్ నుంచి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సారంగపాణి మాట్లాడుతు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను బేషరతుగా భారత్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన అపరేషన్ సిందూర్‌లో ఘనవిజయం సాధించి త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ, జాతీయ పతాకాలతో నిర్వహించిన ర్యాలీ సీతాఫల్ మండి అంబేద్కర్ చౌరస్తా వరకు సందడిగా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరి, ప్రభుగుప్తా, భాస్కర్‌గిరి, ఆకారం రమేష్ పాల్గొన్నారు.



పార్శిగుట్టలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



చిలకలగూడలో తిరంగా ర్యాలీ దృశ్యం